MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
GHMC hmda Growing Global TS-bPASS
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 02-10-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# ఎల్‌బీ నగర్ సర్కిల్‌లో సీజ్ బోర్డుల వెనుక సీక్రెట్ ఏంటి?

**ఆఫీస్ టైమ్‌లో అధికారులు మిస్సింగ్.. ఆ తర్వాత మాత్రం ప్రత్యక్షం? అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎక్కడ..?**

**సైట్‌కి వెళ్లారా.. కోర్టుకా? ప్రజలకు సమాధానం చెప్పేదెవరు? ఎల్‌బీ నగర్ సర్కిల్‌లో ఏసీపీ , సెక్షన్ ఆఫీసర్ తీరుపై ప్రజల ఆగ్రహం**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ స్టేట్ బ్యూరో:** మల్కాజిగిరి మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు స్పందించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఎల్‌బీ నగర్ సర్కిల్‌లో ఏసీపీ , సెక్షన్ ఆఫీసర్ వ్యవహారశైలిపై పలువురు ఫిర్యాదుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో భవనాలకు 'సీజ్‌డ్' బోర్డులు ఏర్పాటు చేసి, ఆ తర్వాత నిర్మాణాలపై సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. బోర్డులు పెట్టిన తర్వాత కూడా నిర్మాణాలు కొనసాగుతున్నాయా? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయా? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని వారు కోరుతున్నారు.

## అధికారులను కలవడమే కష్టమా?

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసేందుకు కార్యాలయానికి వచ్చే ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏసీపీను కలవాలంటే ఆమె కార్యాలయానికి ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో కూడా తెలియని పరిస్థితి ఉందని ఫిర్యాదుదారులు అంటున్నారు. కార్యాలయంలో విచారిస్తే ఒకసారి 'సైట్‌కు వెళ్లారు', మరోసారి 'కోర్టుకు వెళ్లారు' అని సమాధానాలు ఇస్తున్నారని వారు చెబుతున్నారు. దీంతో తమ సమస్యలను చెప్పేందుకు ప్రజలు కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిగతా 5లో

## ఖమ్మం టూ టౌన్,ఖమ్మం అర్బన్, ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించిన సిఐలు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** ఖమ్మం అర్బన్ ఖమ్మం ట్రాఫిక్ ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్లకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా నూతన బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లు జె. రామకృష్ణ యం నాగరాజు కె.శివప్రసాద్.బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

2లో

# రైతులకు అండగా ప్రభుత్వం..

**కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే**

**తలకొండపల్లిలో సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**



రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సూచించారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత తో కలిసి గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వానాకాలం సీజన్‌లో వరి సాగు చేసిన రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్న రకం ధాన్యాన్ని ఈ కేంద్రం ద్వారా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# గిరిజన గర్భిణులకు వరంగా చర్ల సీ హెచ్ సి.

**నెలకు 3 నుంచి 50కి చేరిన ప్రసవాల సంఖ్య.**

**హైరిస్క్ కేసులు సైతం అక్కడే చికిత్స.. నార్మల్ డెలివరీలు ఎక్కువే...**

**జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక దృష్టి.**

**చర్ల/ భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 01:** మారుమూల గిరిజన ప్రాంతమైన చర్లలో మాతా శిశు వైద్య సేవలు గణనీయంగా బలోపేతం అవుతున్నాయి. గతంలో నెలకు సగటున 3--4 ప్రసవాలు మాత్రమే జరిగే చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం నెలకు సుమారు 50 ప్రసవాలు జరిగే స్థాయికి సేవలు విస్తరించాయి. దీంతో గర్భిణులు అత్యవసర సమయాల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతూ, తమకు సమీపంలోనే సురక్షితమైన ప్రసూతి సేవలు పొందుతున్నారు. గత నెల సెప్టెంబర్ మాసం లో చర్ల 46 ప్రసవాలు జరిగాయి. వీటిలో 30 సాధారణ ప్రసవాలు, 16 సిజేరియన్ ప్రసవాలు ఉన్నాయి. వీటితో పాటు 8 హైరిస్క్ ప్రసూతి కేసులకు సకాలంలో అవసరమైన వైద్య సేవలు అందించారు. వీటిలో 4 ప్రీ-ఎక్లాంప్సియా, ఒక ఎక్లాంప్సియా, ఒక అబ్రప్షియో ప్లాసెంటా, ఒక గ్రాండ్ మల్టీపారా, ఒక అబ్స్ట్రక్టెడ్ లేబర్ కేసులు ఉన్నాయి.



సిబ్బంది సమన్వయంతో సాధారణ ప్రసవాలు, సిజేరియన్లు, ట్యూబెక్టమీతో పాటు హైరిస్క్ కేసులకు సేవలు అందిస్తున్నారు. బృంద సమన్వయం, నిరంతర పర్యవేక్షణతో చర్ల జనజలో ప్రసూతి సేవలు మరింత బలోపేతం అవుతున్నాయి.

**గోల్డెన్ అవర్స్‌లో చికిత్స.. తల్లి, శిశువులకు భరోసా.**

చర్ల నుంచి భద్రాచలం సుమారు 56 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో, ప్రసూతి అత్యవసర పరిస్థితుల్లో రవాణా సమయం అత్యంత కీలకంగా మారుతుంది. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణులను అత్యవసర సమయంలో దూరంలోని ఆసుపత్రికి తరలించాల్సిన అవసరం తగ్గి, చర్లలోనే అవసరమైన ప్రసూతి, సిజేరియన్ సేవలు అందుబాటులో ఉండటం ఎంతో ఉపయోగకరంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో గోల్డెన్ అవర్స్‌లోనే వైద్య సేవలు అందించడం ద్వారా సమయాన్ని ఆదా చేయడంతో పాటు, తల్లి మరియు శిశువుల ప్రాణాలను కాపాడే అవకాశాలను మెరుగుపరచవచ్చు. స్థానికంగా సమగ్ర ప్రసూతి సేవలు అందుబాటులో ఉండటం మాతా, శిశు మరణాల నివారణలో కూడా కీలక పాత్ర పోషిస్తోంది.

**టీఫా, ఎ ఎన్ సి స్కానింగ్ సేవలు కూడా అందుబాటులోకి....**

చర్ల లో ప్రసూతి సేవలను మరింత సమగ్రంగా అందించేందుకు టీఫా స్కాన్, ఎ ఎన్ సి సేవలు కూడా కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో గర్భిణులు అవసరమైన యాంటీనేటల్ పరీక్షలు, స్కానింగ్ సేవలను స్థానికంగానే పొందే అవకాశం ఏర్పడింది.

**గైనకాలజిస్ట్, పీడియాట్రిషియన్, అనస్థీషియాలజిస్ట్‌తో నిరంతర సేవలు**

ప్రస్తుతం చర్ల లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఒక గైనకాలజిస్ట్, ఒక అనస్థీషియాలజిస్ట్, అలాగే రెగ్యులర్ ప్రాతిపదికన ఒక పీడియాట్రిషియన్ అందుబాటులో ఉన్నారు. పరిమిత వైద్య వనరుల మధ్య కూడా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్

**కలెక్టర్ అంకిత్ సహకారంతో మౌలిక వసతుల బలోపేతం.**

చర్ల వంటి మారుమూల గిరిజన ప్రాంతంలో వైద్య సేవలను బలోపేతం చేయడంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అందిస్తున్న సహకారం కీలకంగా ఉంది. వైద్యులకు అదనపు ప్రోత్సాహకాలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక వసతులు, నర్సింగ్ సిబ్బంది తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

**ప్రభుత్వ వైద్య సేవలపై పెరుగుతున్న నమ్మకం.**

చర్లలో ప్రసూతి సేవలు బలోపేతం కావడంతో మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు తమ ప్రాంతానికి సమీపంలోనే సురక్షితమైన, సమయానుకూలమైన, నాణ్యమైన మాతా శిశు వైద్య సేవలు అందుతున్నాయి. ప్రసవాల సంఖ్య పెరగడం మాత్రమే కాకుండా, హైరిస్క్ కేసుల నిర్వహణ, సిజేరియన్ సేవలు, ట్యూబెక్టమీ, టీఫా మరియు ఎ ఎన్సి స్కానింగ్ సేవలు స్థానికంగా అందుబాటులోకి రావడం వల్ల చర్ల మాతా శిశు ఆరోగ్య సేవలకు ముఖ్యమైన కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. దూరం తగ్గింది.. వైద్య భరోసా పెరిగింది" అన్నట్లుగా, చర్లలో బలోపేతమైన ప్రసూతి సేవలు గిరిజన ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచుతున్నాయి.

**సేవలపై మంత్రి పొంగులేటి, ఎంఎల్ఏ తెల్లం ప్రశంస.**

ఈటీవలే 30 పడకల చర్ల ఆసుపత్రి భవనం నిర్మాణ ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం ఈ మారుమూల ప్రాంతంలో చర్ల ఆసుపత్రి అందిస్తున్న వైద్య సేవలను స్థానిక శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట రావు ద్వారా తెలుసుకొని సిబ్బంది ని అభినందిస్తూ సేవలను పలు వేదికల్లో కొనియాడారు.



## సుదర్శన క్రియ, యోగ, ధ్యానం విద్యార్థుల విజయానికి బలమైన పునాది

**ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా కోఆర్డినేటర్ పల్లపు బుధ్దుడు**

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం పెద్దకాపర్తి, అక్టోబర్ 1: ప్రతిరోజూ సుదర్శన క్రియ, యోగ, ధ్యానం సాధన చేయడం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం పెరుగుతాయని ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ నల్గొండ జిల్లా కోఆర్డినేటర్, టీచర్ పల్లపు బుధ్దుడు అన్నారు. పెద్దకాపర్తి ప్రభుత్వ హాస్టల్‌లో ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల హ్యాపీనెస్ కోర్స్ ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సుదర్శన క్రియ, యోగ, ధ్యాన సాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లపు బుధ్దుడు మాట్లాడుతూ ప్రతిరోజూ కనీసం పది నిమిషాలు ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణతో పాటు సానుకూల ఆలోచనలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థుల శారీరక, మానసిక సామర్థ్యాల అభివృద్ధికి యోగ, ధ్యానం ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ధర్మపురి తార, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. హ్యాపీనెస్ కోర్సులో పాల్గొన్న విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు.

## మందమర్రి స్టేషన్‌లో సీపీ అంబర్ కిశోర్ ఝా వార్షిక తనిఖీ

**మందమర్రి, అక్టోబర్ 1 (క్రైమ్ మిర్రర్) :** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని మందమర్రి పోలీసుస్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, ఎస్ఐ నరేష్ మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సిబ్బంది నుంచి సీపీ గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ పరిసరాలు, సిబ్బంది బ్యారక్‌లను పరిశీలించిన సీపీ.. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని, అన్ని రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. రిసెప్షన్ కేంద్రం నిర్వహణ, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, సీసీటీఎన్ఎస్ రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను రైటర్లను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్‌పై ఎస్ఐ నుంచి వివరాలు సేకరించారు. అనంతరం సిబ్బంది వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మందమర్రి సింగరేణి పారిశ్రామిక ప్రాంతం కావడంతో ప్రత్యేక సవాళ్లు ఉంటాయని, దొంగతనాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ సూచించారు. పాత నేరస్థుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరాన్ని బట్టి నిబంధనల ప్రకారం గ్యాంగ్ ఫైళ్లు తెరిచి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మందమర్రి ప్రాంతాన్ని నేర, మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# రైతులకు అండగా ప్రభుత్వం..

తలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. విద్యార్థి దశలోనే భవిష్యత్‌కు బలమైన పునాది వేసుకోవాలని, విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పిస్తూ వారి ప్రతిభను ప్రోత్సహించాలని అధ్యాపకులను కోరారు. ఈ కార్యక్రమాల్లో తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, రమాదేవి, ప్రజాప్రతినిధులు, సింగిల్ విండో డైరెక్టర్లు, అధికారులు, రైతులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## పారదర్శకతకు సామాజిక తనిఖీ

అభివృద్ధి పనులపై గ్రామ సభలో సమీక్ష

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి): తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ కాసు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభకు పాలకవర్గ సభ్యులు, అధికారులు, సామాజిక తనిఖీ బృందం, గ్రామ ప్రజలు హాజరయ్యారు..ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం సమర్పించిన నివేదికను గ్రామ సభలో చదివి వినిపించారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పనులు, లబ్ధిదారుల వివరాలు, కూలీల హాజరు, చెల్లింపులు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలతో పాటు ప్రజల అభ్యంతరాలు, సూచనలను సభలో నమోదు చేశారు. వాటిపై అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గ్రామ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, మౌలిక వసతుల కల్పనకు సంబంధించి ప్రజల నుంచి సూచనలు స్వీకరించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు, అభిప్రాయాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## సౌమ్య వైద్య విద్యకు ఉప్పల వెంకటేష్ చేయూత

గ్రామీణ విద్యార్థినికి రూ.10 వేల ఆర్థిక సాయం.. విద్యకు అండగా ఉంటానని హామీ

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించేందుకు అండగా నిలుస్తూ ఉప్పల వెంకటేష్ ఆర్థిక చేయూత అందించారు. కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన శ్రీశైలం కుమార్తె సౌమ్య వైద్య విద్యలో సీటు సాధించడంతో ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ సౌమ్య విద్యా ఖర్చుల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ విద్యకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కల్వకుర్తి మార్కెట్ చైర్మన్ వట్టేపు బాలయ్య, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు రుక్మొద్దీన్, హాజీలాపూర్ సర్పంచ్ సిద్ధగోని రమేష్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కర్ణాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్ల సురేష్ గౌడ్, వర్కాల దేవయ్య, మాణిక్య రావు, వాటం రవి, ఉప్పల వెంకటేష్ అన్న సైన్యం వంశీ తదితరులు పాల్గొన్నారు.



## కడ్తాలలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలకు సన్నాహాలు

ఉదయం 8:30 గంటలకు గాంధీ విగ్రహానికి పాలాభిషేకం.. ఆస్పత్రిలో పండ్లు, పాలు పంపిణీ



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్): మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను కడ్తాల మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 2న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు, కడ్తాల్ సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ నడిబొడ్డున ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి శుక్రవారం రోజు ఉదయం 8:30 గంటలకు పాలాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేయడంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు గాంధీజీ అహింస, సత్యాగ్రహం, సహాయ నిరాకరణ వంటి మార్గాలను ఆయుధాలుగా చేసుకుని ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని కొనియాడారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ఉండాలని చాటిన మహాత్ముడి ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీ జయంతి వేడుకలను విజయవంతం చేసేందుకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బి. రామకృష్ణ గుప్తా, యువజన అధ్యక్షుడు బి. వీరేందర్ గుప్తా కోరారు.

## ఏబీవీపీ మహాదేవపూర్ నూతన కమిటీ ఎన్నిక

- నగర కార్యదర్శిగా అడుప సాయికిరణ్
- విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు
- విద్యార్థుల్లో నాయకత్వం, సామాజిక చైతన్యంపై ప్రత్యేక దృష్టి



క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మహాదేవపూర్ నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పేట సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వరంగల్ విభాగ్ సంఘటన మంత్రి పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మహాదేవపూర్ నగర కార్యదర్శిగా అడుప సాయికిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, విద్యా రంగంలో నాణ్యత, క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి అంశాలపై నిరంతరం పనిచేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. మహాదేవపూర్ ప్రాంతంలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మౌలిక వసతులు తదితర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక చైతన్యం పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నూతన నగర కార్యదర్శి అడుప సాయికిరణ్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నగర జాయింట్ సెక్రెటరీలు వినయ్, సుశాంత్, టౌన్ హాస్టల్స్ కన్వీనర్ శ్రీకాంత్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ ఆదిత్య, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ విజయ్, మహిళా కన్వీనర్ కీర్తన, సామాజిక మాధ్యమాల కన్వీనర్ ఆకాష్, వంశీ, ఇతర ముఖ్య కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో సర్పంచ్‌కు సమాచారం కరువు

ఆర్డీవోకు ఫిర్యాదు.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతి..



చండూరు, క్రైమ్ మిర్రర్: నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు మండలం గుండ్రపల్లి గ్రామపంచాయతీ పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా నిర్వహించడంపై వివాదం నెలకొంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ఉజ్జిని ఉష అనిల్ రావు గురువారం చండూరు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.గ్రామంలో ప్రభుత్వ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక రాజకీయ నాయకులు, రేషన్ డీలర్‌తో కలిసి అధికారులు నిర్వహించారని, అయితే తనతో పాటు ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని సర్పంచ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శికి సైతం ఈ కార్యక్రమం గురించి తెలియదని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా అమలు చేయాలని, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం పాటించాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమానికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు, మార్గదర్శకాలను పరిశీలించి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత జీపీఓ, అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామపంచాయతీతో సమన్వయం చేసుకుంటూ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని, విచారణ వివరాలను లిఖితపూర్వకంగా అందించాలని ఆర్డీవోను కోరారు. తక్షణమే స్పందించిన చండూరు ఆర్డీవో వందనపు శ్రీదేవి జిపిఓ కు మెమో జారీ చేయాలని తాసిల్దార్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో చండూరు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న, గుండ్రపల్లి సర్పంచ్ ఉజ్జిని ఉష, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎత్తపు మధుసూదన్ రావు,బిఆర్ఎస్ చండూరు మండల ఉపాధ్యక్షులు కూరపాటి సుదర్శన్, అధికార ప్రతినిధి బొడ్డు సతీష్ గౌడ్, చండూరు మండలం యువజన అధ్యక్షులు ఉజ్జిని అనిల్ రావు,చండూరు మాజీ కౌన్సిలర్ అనపర్తి శేఖర్, పడమటితాళ్ల సర్పంచ్ గాలెంక రాంబాబు, గుండ్రపల్లి ఉపసర్పంచ్ టేకుల వినోద్ రెడ్డి, వార్డు మెంబర్లు పెండ్యాల నిర్మల్ రావు, తీగల వెంకన్న, వడ్డమల్ల మధు, కాశమల్ల శ్రీనివాసరావు కాశమల్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటు ధరలో హరిత గృహ నిర్మాణంపై అవగాహన సభ

**పర్వేద సర్పంచ్ సురేందర్ గౌడ్**

**క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి:** అందుబాటు ధరలో పర్యావరణహితమైన, ఆరోగ్యకరమైన ఇళ్లను నిర్మించేందుకు అనుసరించాల్సిన హరిత గృహ నిర్మాణ పద్ధతులపై పర్వేద గ్రామస్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని పర్వేద గ్రామ సర్పంచ్ ఎన్మతల సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కెపాసిటీ బిల్డింగ్ గ్రీన్ అఫోర్డబుల్ హౌసింగ్ ప్రతినిధులు గ్రామపంచాయతీ పరిధిలో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, తక్కువ ఖర్చుతో మెరుగైన గృహ నిర్మాణానికి పాటించాల్సిన ఆధునిక పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేందర్ గౌడ్ మాట్లాడుతూ, గృహ నిర్మాణంలో ప్రారంభ దశ నుంచే పర్యావరణహిత విధానాలను అనుసరించడం ద్వారా తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ఇళ్లను నిర్మించుకోవచ్చని తెలిపారు. ఇంటి డిజైన్‌ను రూపొందించే సమయంలో సహజ గాలి, వెలుతురు సమృద్ధిగా లభించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గ్రామస్థులకు సూచించారు. ప్రతి నివాస గదిలో క్రాస్ వెంటిలేషన్ ఉండేలా పక్కపక్కన లేదా ఎదురెదురుగా ఉన్న గోడలపై తగిన ఓపెనింగ్స్ ఏర్పాటు చేసుకోవాలని సురేందర్ గౌడ్ వివరించారు. బెడ్‌రూమ్‌లను రాత్రి సమయంలో వినియోగించే విధానాన్ని దృష్టిలో ఉంచుకుని సరైన దిశలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాత్రూమ్ వంటి తక్కువ సమయం ఉపయోగించే ప్రాంతాలను ఇంటిలో వేడి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం ద్వారా ప్రధాన నివాస గదులపై ఉష్ణభారాన్ని తగ్గించవచ్చని తెలిపారు. అలాగే మెట్లు, ఇతర తక్కువగా ఉపయోగించే ప్రదేశాలను సరైన దిశలో ఏర్పాటు చేయడం ద్వారా



ఇంటిలోకి వచ్చే ప్రత్యక్ష వేడిని తగ్గించుకోవచ్చని చెప్పారు. కిటికీలు, వెంటిలేషన్‌ను సరైన విధంగా ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఇంటిలోకి సహజ సూర్యకాంతి, గాలి సమృద్ధిగా వచ్చి పగటి సమయంలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామస్థుల అవసరాలు, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ ఖర్చుతో మెరుగైన, ఆరోగ్యకరమైన గృహ నిర్మాణం జరిగేలా అవగాహన కల్పించడమే తన లక్ష్యమని సర్పంచ్ సురేందర్ గౌడ్ తెలిపారు. హరిత గృహ నిర్మాణ పద్ధతులను ప్రతి ఒక్కరూ పాటించడం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన నివాస వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. పర్వేద గ్రామపంచాయతీ అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కార్యక్రమాలకు సర్పంచ్ సురేందర్ గౌడ్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని ఈ సందర్భంగా గ్రామస్థులు పేర్కొన్నారు.

# ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభల జయప్రదం కోరుతూ విస్తృత ప్రచారం

**వాడవాడలా తెలంగాణ రైతు సంఘం జెండా ఎగరాలి**

**తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, రచ్చ నరసింహారావు**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** నవంబర్ 15, 16, 17, 18 తేదీలలో నల్లగొండ జిల్లాలో జరిగే అఖిల భారత కిసాన్ సభ(తెలంగాణ రైతు సంఘం) 36వ జాతీయ మహాసభల జయప్రదం కోరుతూ విస్తృత ప్రచారం చేయాలని, ప్రతి గ్రామంలో తెలంగాణ రైతు సంఘం జెండా ఎగురవేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొడవర్తి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు రచ్చ నరసింహారావు పిలుపునిచ్చారు. మహాసభల జయప్రదం కోరుతూ గురువారం మండలంలోని మోటాపురం గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన సెంటర్లో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతు సంఘం జెండాను రైతు సంఘం సీనియర్ నాయకులు ఏలూరి రంగారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ కష్టమొచ్చినా నష్టమొచ్చిన కరువోచ్చిన అధైర్య పడకుండా దేశానికి అన్నం పెట్టాలనే సంకల్పంతో లాభం లేకపోయినా కుటుంబం గడవకపోయినా అన్నింటినీ ఎదిరించి నిత్యం పోరాడుతున్న అన్నదాతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. గత అనేక ఏళ్లుగా అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో రైతులెదుర్కొంటున్న అనేక సమస్యలపై ఉద్యమిస్తూ ఫలితాలు సాధిస్తూ నిత్యం వారికి అండగా నిలుస్తుందన్నారు. రైతాంగ హక్కుల సాధన, వ్యవసాయ రంగం రక్షణ కోసం దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలు నిర్వహించి సాగుదారులకు రక్షణ కవచంలా రైతు సంఘం నిలిచిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగా తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో 13 నెలల పాటు కొనసాగిన చారిత్రాత్మక రైతు ఉద్యమంలో అఖిలభారత కిసాన్ సభ ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలు చేపడుతున్నామని గొప్పలు చెబుతూ పబ్బం గడుపుతున్నారే తప్ప ఆచరణలో అమలు కావడం లేదన్నారు. పెరిగిన పెట్టుబడులు, తగ్గిన దిగుబడులు, గిట్టుబాటుకాని ధరలతో నిత్యం అన్నదాతలు అప్పుల పాలవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై మరో మారు సమర శంఖం పూరించేందుకు అఖిల భారత కిసాన్ సభ సమాయత్తమవుతుందన్నారు. ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభల పేరుతో తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యమాల ఖిల్లా నల్లగొండ జిల్లా వేదిక కాబోతుందన్నారు. నవంబర్ 15న లక్ష మంది రైతులతో భారీ ప్రదర్శన బహిరంగసభతో నల్లగొండ జిల్లా ఎరుపెక్కనున్నదన్నారు. ఈ మహాసభలకు మాజీ ముఖ్యమంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాస్త్రవేత్తలతో పాటు దేశ వ్యాప్తంగా రైతు ఉద్యమంలో విశేష అనుభవం గడించిన 2 వేల మంది రైతు నేతలు ప్రతినిధులుగా హాజరవుతున్నారని చెప్పారు. మహాసభలో దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యచరణను రూపొందించడం జరుగుతుందన్నారు తెలంగాణ రాష్ట్రంలో చారిత్రాత్మకంగా నిర్వహించబోయే మహాసభల జయప్రదం కోరుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో రైతు సంఘం జెండా ఆవిష్కరణలు, భారీ ట్రాక్టర్ ర్యాలీ, బైకు ర్యాలీలు, సెమినార్లు నిర్వహణ, ఇంటికో మనిషి ఊరకోబస్సు నినాదంతో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల ప్రచారం సందర్భంగా ప్రతి ఒక్కరు హార్దికంగా, ఆర్థికంగా సహాయ సహకారాలు అందించి రైతన్నకు వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు ఇంటూరి అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం పాలే డివిజన్ కార్యదర్శి కెవి రామిరెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, గ్రామ సర్పంచి ఏలూరు రామారావు, రైతు సంఘం నాయకులు చావా బాబు, వీరు, వెంకయ్య, రామచంద్రు, రామయ్య, గోపాలరావు, ఏలూరు కోదండ రామారావు, తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేద కుటుంబానికి ఇంటి నిర్మాణంలో ఉప్పల వెంకటేష్ చేయూత

**ఫినిషింగ్ పనుల కోసం సిమెంట్ అందజేత**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ):** నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసేందుకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. వెల్దండ మండలానికి చెందిన బాచేపల్లి శ్రీను, బాలస్వామి కుటుంబం ఇంటి నిర్మాణాన్ని చేపట్టగా, ఫినిషింగ్ పనుల కోసం తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన ట్రస్ట్ ద్వారా సిమెంట్‌ను అందజేశారు..నిరుపేద కుటుంబాల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తామని ఉప్పల వెంకటేష్ తెలిపారు. ఇంటి నిర్మాణానికి సిమెంట్ అందించినందుకు కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు కానుగుల జోగయ్య, మాజీ ఎంపీటీసీ చలిచీమల జ్యోతి నిరంజన్, బాచేపల్లి గోపాల్, కుమార్ ముదిరాజ్, పూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు గ్రీన్ గ్రోవ్ విద్యార్థుల ఎంపిక

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** నల్గొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో సెప్టెంబర్ 29న నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ క్రీడాకారుల ఎంపికలో చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఆగు దివ్యభాను అండర్ 17 బాలికల విభాగంలో , 6వ తరగతి విద్యార్థినిఅండర్ 14 బాలికల విభాగంలో ఏర్పుల ఊహస్మిత , 8వ తరగతి విద్యార్థి గంగాపురం మనస్విక్ అండర్ 14 బాలుర విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో అక్టోబర్ 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, చిట్యాల ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఏవో పోల గోవర్ధన్, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగాపురం రాము, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు



## సామాన్యుడి వజ్రాయుధం సమాచార హక్కు చట్టం

**తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి.శ్రీనివాసరావు**




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** సమాచార హక్కు చట్టం సామాన్య పౌరుడికి వజ్రాయుధం వంటిదని తెలంగాణ సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారంనాడు ఎస్ ఆర్ బి జివిఆర్ ప్రభుత్వ కళాశాల లో ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా అధ్యక్షతన జరిగిన సమాచార హక్కు చట్టం -స్వరూప స్వభావాలు అనే అంశంపై జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలు,చరిత్ర, గతం వర్తమానం భవిష్యత్తు గురించి విద్యార్థులుఅధ్యయనం చేయాలని సూచించారు. కళాచరిత్ర ను ఈనాటి విద్యార్థులు తెలుసుకోవాలని పేర్కొన్నారు. శ్రీశ్రీ లాంటి కవులు సందర్శించిన కళాశాల లో చదువుతున్నామని సగర్వంగా నిలవాలని కోరారు. జవాబుదారితనం ఉండాలనే ఆలోచనతో ఈ చట్టం వచ్చిందని, పౌర సమాజానికి పారదర్శకత ఉండాలనే ఆకాంక్ష తో ఆర్టిఐ-2005 లో సమాచార హక్కు చట్టాన్ని రూపొందించారని తెలిపారు. విద్యార్థులు సామాజిక అవగాహన తోపాటు , పౌరబాధ్యతలను గుర్తెరిగి వ్యవహరించడం ముఖ్యమన్నారు. రాజ్యాంగ వ్యవస్థలగురించి అవగాహన ఈకలిగిఉండటం అనివార్యమని వెల్లడించారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ ఎన్ శాస్త్రి, ఎగ్జామ్స్ కంట్రోలర్ డా.రమాసత్యవతి,పూర్వ విద్యార్థి వంజాకులలక్ష్మీ నారాయణ గెంటేలనారాయణరావు మనుమడు శ్రీనివాసరావు, అధ్యాపకులు బంగారా, డా.వైరవివర్ధన్, డా.లక్ష్మణరావు, పి.నరసింహారావ, అజిత్, అప్పారావు కె.శ్రీనివాస్, వివిధ విభాగాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు సృజనాత్మక విద్య అవసరం

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 01:** చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యతో పాటు సృజనాత్మక వాతావరణం ఎంతో అవసరమని ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ అన్నారు. జేపీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పోస్టర్ కిడ్స్ ప్లే స్కూల్‌ను గురువారం ఆయన సందర్శించారు. గత ఆదివారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోయిన ఆయన, తాజాగా పాఠశాలను సందర్శించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. చిన్నారులకు పుస్తకాల ద్వారా విద్య అందించడంతో పాటు ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం ద్వారా వారి ప్రతిభను వెలికితీయాలని సూచించారు. చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాలను పెంపొందించే దిశగా పోస్టర్ కిడ్స్ ప్లే స్కూల్ మరింత అభివృద్ధి చెంది మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.




# ఎల్‌బీ నగర్ సర్కిల్‌లో సీజ్ బోర్డుల వెనుక సీక్రెట్ ఏంటి?

ప్రభుత్వ కార్యాలయ సమయం ముగిసిన తర్వాత కూడా అధికారులు కార్యాలయానికి వస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య కార్యాలయానికి వచ్చి వ్యక్తిగత పనులు చేసుకుంటున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. ఈ సమయంలో ప్రైవేట్ వ్యక్తులతో ఫైళ్లకు సంబంధించిన వ్యవహారాలు జరుగుతున్నాయంటూ కొందరు ఫిర్యాదుదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్రంగా ధృవీకరించిన ఆధారాలు వెల్లడికాలేదు. ఈ అంశంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

**'చూసీచూడనట్లు వదిలేస్తున్నారా?'**

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసిన తర్వాత సంబంధిత వ్యక్తులతో అధికారులు రాజీ చేసుకుని, నిర్మాణాలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు నిజమా కాదా అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది. ఫిర్యాదులు వచ్చిన ప్రతి అక్రమ నిర్మాణంపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నారా? సీజ్ చేసిన భవనాలపై తదుపరి చర్యలు ఏమిటి? ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలు ఏమిటి? అనే ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

అధికారులను కలవడానికి ప్రజలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా అధికారుల అందుబాటు, ఫిర్యాదుల స్వీకరణ, వాటిపై చర్యల వివరాలు పారదర్శకంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు. ఎల్‌బీ నగర్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులపై ఏసీపీ , సెక్షన్ ఆఫీసర్ పాత్రపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణల్లో వాస్తవం ఉంటే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు డిమాండ్ చేస్తున్నారు. విచారణ పూర్తయ్యే వరకు అధికారులపై వచ్చిన ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించరాదని, సంబంధిత అధికారుల వివరణ కూడా వెలువడాల్సి ఉందని స్పష్టత అవసరం.

## బీజేపీ ఓబీసీ మోర్చా నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇమ్మడి మహేష్ నియామకం



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తలకొండపల్లి మండలం వెంకట్రావుపేట సర్పంచ్ ఇమ్మడి మహేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనకు అప్పగించిన బాధ్యతపై మహేష్ హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన రాష్ట్ర పార్టీ నాయకత్వానికి, తల్లోజు ఆచారి కి, నాగర్‌కర్నూల్ జిల్లా పార్టీ నాయకులకు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా అధ్యక్షులు జెట్టి వెంకటేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా ఇమ్మడి మహేష్ మాట్లాడుతూ, పార్టీ అప్పగించిన బాధ్యతను కేవలం పదవి గా కాకుండా ఓబీసీ సమాజానికి, పార్టీకి సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, నాయకుల మార్గదర్శకత్వంలో, కార్యకర్తల సహకారంతో ఓబీసీ మోర్చా ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని ఇమ్మడి మహేష్ పేర్కొన్నారు.

## ఐదు రోజులు తాగునీటి సరఫరాకు అంతరాయం

**రోడ్డు విస్తరణ పనుల్లో పైప్‌లైన్ల మార్పు.. ట్యాంకర్లతో నీరందిస్తాం: కమిషనర్ మురళీకృష్ణ**



**రామకృష్ణాపూర్: అక్టోబర్ 1 (క్రైమ్ మిర్రర్) :** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ ఫ్లైఓవర్ నుంచి విఠల్‌నగర్ చౌరస్తా వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో మిషన్ భగీరథ పైప్‌లైన్లను పక్కకు మార్చే పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పైప్‌లైన్ల మార్పు పనుల కారణంగా ఆయా ప్రాంతాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు సుమారు ఐదు రోజుల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఈలోగా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నీటి ట్యాంకర్ల ద్వారా ప్రతిరోజూ తాగునీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు తమకు అందుబాటులో ఉన్న బోర్‌వెల్స్‌ను కూడా వినియోగించుకోవాలని సూచించారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ తాగునీటి సౌకర్యాలను వినియోగించుకుని సహకరించాలని కమిషనర్ మురళీకృష్ణ కోరారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా -- కార్యకర్తల ఐక్యతతో ముందుకు సాగుదాం

**కాంగ్రెస్ పార్టీ -- దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో బోయపల్లి గోవర్ధన్ రెడ్డి**

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల సమక్షంలో పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు మరియు రాబోయే ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఏపీఆర్ఆర్ గార్డెన్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అల్మాస్‌గూడ, గుర్రంగూడ, నాదర్‌గుల్ ప్రాంతాలకు చెందిన పలువురు క్రియాశీలక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ పార్టీ పదవులు మరియు నామినేటెడ్ పదవులకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని నాదర్‌గుల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు మరియు రాబోయే ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు తమ దరఖాస్తులను పార్టీ అధిష్టానం మరియు నియోజకవర్గ ఇన్‌చార్జి నాయకత్వానికి సమర్పించారు. పార్టీ అవసరాలు, నాయకులు మరియు కార్యకర్తల సేవలు, వారి అనుభవం, పార్టీ పట్ల నిబద్ధత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పార్టీ అధిష్టానం తగిన నిర్ణయాలు తీసుకోనుంది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నవార్ మల్లారెడ్డి, పుట్టగల జగన్, పెతుల ఆనంద్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుభాన్ యాదవ్, రవికాంత్ రెడ్డి, నవార్ ప్రభాకర్ రెడ్డి, ఓం భిక్షపతి రెడ్డి, శ్రీధర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, లక్ష్మీ నరసమ్మ, రామిడి కృష్ణారెడ్డి, రామిడి దిలీప్ రెడ్డి, పుట్టగల భాస్కర్, మధుసూదన్ రెడ్డి, పెరుమాళ్ల నవీన్ రెడ్డి, ముక్తా రేవంత్, యాదగిరి రెడ్డి, నాగార్జున, వంశీధర్, సంతోష్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



## ఓబీసీ సింహగర్జన సమావేశం విజయవంతం కావాలి: డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :**రాష్ట్రంలో బీసీల హక్కుల సాధన, రాజకీయ ప్రాధాన్యం మరియు సంక్షేమమే ధ్యేయంగా ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న ప్రతిష్టాత్మక ఓబీసీ సింహగర్జన కార్యక్రమ సన్నాహక సమావేశం రాజేంద్రనగర్ నియోజక వర్గం శంషాబాద్ లోని గొల్లపల్లి రోడ్డులో నిర్వహించడం జరిగింది. టీపీసీసీ ఓబీసీ ఛైర్మన్, షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ సలహాదారులు హనుమంత్ రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సన్నాహక సమావేశంలో రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రత్యేకంగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, వారి హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 4న తలపెట్టిన 'ఓబీసీ సింహగర్జన' సభను చారిత్రాత్మక విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా నుండి ఓబీసీ నాయకులు, కార్యకర్తలు, యువకులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బీసీ వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా, వారికి తగిన రాజకీయ మరియు సామాజిక అవకాశాలు దక్కేలా ఈ గర్జన వేదికగా గట్టి సందేశం ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ముదిరాజ్ కార్పోరేషన్ ఛైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మాజీ డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఛైర్మన్ అజయ్, వైస్ ఛైర్మన్ బంగారి బాబు, నియోజకవర్గ ఇంచార్జీలు భీం భరత్, జగదీశ్వర్ గౌడ్, ముద్దగౌని వేణు గౌడ్, ఓబీసీ కన్వీనర్లు డా.ధనలక్ష్మి, డా.వెంకటేష్ పీసీసీ మెంబెర్స్ అయిల్ల శ్రీనివాస్ గౌడ్, కొత్తకూర్మ శివ కుమార్, నాయకులు, ఓబీసీ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ నుండి షిరిడీ కి 15వ పాదయాత్ర

**చిట్యాల క్రైమ్ మిర్రర్:**ఏపి లోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామంలో ని చిన్న షిరిడి సాయిబాబా ఆలయం నుండి మహారాష్ట్రలోని షిరిడి సాయిబాబా ఆలయం వరకు శానంపూడి శ్రీహరి ఆధ్వర్యంలో 15వ మహా పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర గురువారం చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామం వరకు చేరింది. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయం మేనేజింగ్ ట్రస్ట్ శానంపూడి శ్రీహరి మాట్లాడుతూ సాయిబాబా సమాధి చెంది 108 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మేము సెప్టెంబర్ 27వ తేదీన ఈ పాదయాత్ర చేపట్టామన్నారు. రోజుకు 35 నుండి 40 కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేస్తామన్నారు. అంతేకాకుండా లోక కల్యానార్థం ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పాదయాత్ర చేస్తున్నామని ఈ నెల 17 లేదా 18వ తేదీన షిర్డీ చేరుకుంటామని తెలిపారు. శానంపూడి శ్రీహరి ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రలో మండాది కొండా రెడ్డి, చల్లా శ్రీనివాసరావు, ఎక్కంటి చంద్రశేఖర్ రెడ్డి, కడియాల ప్రకాశరావు, కట్టూరాపు విజయ్, అవులూరి రామకృష్ణా రెడ్డి, అవులూరి పద్మావతి



# విజయయంతంగా ముగిసిన ఏ.ఐ.కె. ఎం. ఎస్ అఖిల భారత మహాసభ



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఏఐకేఎంఎస్ మహాసభ ముగిసింది. పోరాటపటిమ గల ప్రజా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిస్తూ, గత బృందంతో కొత్త నాయకులు నాయకత్వం వహించనున్నారు. ఫాసిస్ట్ దాడులు, కార్పొరేట్ దోపిడీ, భూస్వాముల అణచివేతను తిప్పికొట్టడానికి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సంఘటితం కావాలని రైతులను ప్రేరేపించాలని కొత్త అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జీవనాధార భూమి, అడవులు, నదులను కాపాడటానికి బలమైన ఉద్యమాలను నిర్మించాలి. ఎరుపు రంగు నేపథ్యంలో ఆకుపచ్చ గీత, నాగలి, కొడవలితో కూడిన కొత్త జెండాను 4వ మహాసభ ఏఐకేఎంఎస్ మహాసభఆమోదించింది. అనేక రైతు సమస్యలు, నీటి సంక్షోభం తీవ్రత, అప్రజాస్వామిక చట్టాల రద్దు, సీఈసీ జ్ఞానేస్ కుమార్కి శిక్షించాలని తీర్మానాలు ఆమోదించింది. ఏఐకేఎంఎస్ 4వ మహాసభ నిన్న రాత్రి సుమారు 8.30 గంటలకు కామ్రేడ్ అజ్మీర్ సింగ్ హాల్ (ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్, ఖమ్మం)లో ముగిసింది. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు కామ్రేడ్ నిర్భయ్ సింగ్ దుడికే, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ జె.వి. చలపతి రావు తమ భుజాలపై మోపబడిన బాధ్యతలను వినయంగా స్వీకరిస్తూ ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. గ్రామీణ భారతదేశ దోపిడీకి సంబంధించిన మూల సమస్యల పట్ల తమను తాము పునఃసమీక్షించుకోవాలని వారు అగ్రగామి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే, తమ పనితీరును మార్చుకుని, జీవనాధార భూమి, అడవులు, నదులను కాపాడటానికి బలమైన, పోరాటపటిమ గల ఉద్యమాలను నిర్మించేందుకు భూమిలేనివారు, వ్యవసాయ కార్మికులు, చిన్న, మధ్యతరహా రైతులను సంఘటితం చేయాలని వారికి పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్–బీజేపీ, ఇతర డబుల్ ఇంజన్ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల హక్కులపై చేస్తున్న ఫాసిస్టు దాడులను ప్రజా ఉద్యమాలను నిర్మించడం ద్వారా మాత్రమే తిప్పికొట్టగలమని వారు అన్నారు. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ, ఆహార శుద్ధి, నిల్వ, మార్కెటింగ్ రంగాల నుండి అన్ని కార్పొరేషన్లు, దేశ, విదేశీ బహుళజాతి, కార్పొరేట్ సంస్థలను నిషేధించాలనే తమ డిమాండ్ను వారు నొక్కి చెప్పారు. ఈ నూతన సామ్రాజ్యవాద ధోరణి, రైతులపై భూస్వాముల దాడులను మరింతగా ప్రోత్సహించిందని, తెలంగాణ, నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరిలోయల రైతుల పోరాటాల ప్రాముఖ్యతను పునరుద్ఘాటించాల్సిన సమయం ఆసన్నమైందని వారు పేర్కొన్నారు. రైతుల పోరాటానికి ఐక్య సంస్థగా ఎస్కేఎం అభివృద్ధిని ప్రశంసిస్తూ, వరి ధన్యానికి కేవలం 3 శాతం, గోధుమలకు ఒక శాతం కంటే తక్కువ మాత్రమే ధర పెంచడాన్ని వారు తీవ్రంగా విమర్శించారు. అంతకుముందు జరిగిన సమావేశం, కామ్రేడ్స్ఆశిష్ మిట్టల్, సుధాకర్లను ఉపాధ్యక్షులుగానూ, కామ్రేడ్లు బాలచంద్ర, రమీందర్ సింగ్లను కార్యదర్శులుగానూ, కామ్రేడ్ చిట్టిపాలో వెంకటేశ్వర్లుని కోశాధికారిగా, కామ్రేడ్స్ వి. వెంకట్రామయ్య, గౌనీ ఐలయ్య, సుశాంతో ఝా, దేబాజిత్ చౌదరి, శంభు ప్రసాద్, ధరంపాల్ సింగ్, జెడ్.పి.ఎస్.సి. నుండి కామ్రేడ్ ముఖేష్ మలౌత్లను సభ్యులుగా కలిగిన 15 మంది సభ్యుల కేంద్ర కార్యనిర్వాహక కమిటీని ఎన్నుకుంది. వ్యవసాయ పోరాటాలు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఈ సమావేశం తన జెండాను మార్చడం ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చింది. ఆమోదించిన కొత్త జెండాలో ఎడమవైపున ఆకుపచ్చ పట్టీపై నిలువుగా ఏఐకేఎంఎస్ చిహ్నం, వెడల్పాటి ఎర్రటి ఆధారంపై రైతులు, వ్యవసాయ కార్మికుల సాంప్రదాయ చిహ్నాలైన నాగలి, కొడవలి ఉన్నాయి. కార్పొరేషన్ల దాడులు తీవ్రతరం అవుతున్న కొద్దీ, పోరాటాలలో భూస్వాములకు వ్యతిరేకంగా రైతాంగ భాగస్వామ్యం పెరగడం ఖాయమనీ, పోరాటంలో ఇరు వర్గాల ఐక్యతకు జెండా ప్రతీకగా నిలవాలనే వాస్తవాన్ని గుర్తించి ఈ జెండాను రూపొందించారు. ఈ సమావేశం 17 తీర్మానాలను పరిశీలించి, రాబోయే పోరాటాలకు మార్గనిర్దేశం చేసేందుకు వాటిని ప్రత్యేక అంశాలుగా అమోదించింది. వీటిలో పెద్ద ఆనకట్టలకు వ్యతిరేకత కరువు, వరదల శాస్త్రీయ నిర్వహణకు మద్దతు కెన్ బెట్వా నదుల అనుసంధానానికి వ్యతిరేకత; రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ సమస్యను పరిష్కరించడం, నదీతీర ప్రాంతాల సూత్రాన్ని అమలు చేయడం, వ్యవసాయ-వాతావరణ మండలాలకు అనుగుణంగా పంటల సరళిని మార్చడం; స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను (ఖీూాం), ముఖ్యంగా అమెరికాతో ఒప్పందాన్ని వ్యతిరేకించడం; ఈ–20 పెట్రోల్ కోసం ఆహార ధాన్యాల నుండి ఇథనాల్ ఉ త్పత్తిని ప్రోత్సహించడాన్ని వ్యతిరేకించడం కొనుగోలుకు హామీ ఇస్తూ సి2ం50% వద్ద కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి) అమలు వ్యవసాయ కార్మికులతో సహా రైతులందరికీ రుణమాఫీ, ఆత్మహత్యలను ఆపడం పేదరికాన్ని తగ్గించామన్న ప్రభుత్వ తప్పుడు వాదనలను ఖండించడం; గల్ఫ్, ఇరాన్, గాజా, లెబనాన్, సిరియాలపై సామ్రాజ్యవాద యుద్ధాలనూ, ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్నీ ఖండించడం పెరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా, ఖూూాూ, చీూా వంటి నల్ల చట్టాలను రద్దు చేయడం, వాటి కింద నిర్బంధంలో ఉన్న ఖైదీలందరినీ బేషరతుగా విడుదల చేయడం భూ గరిష్ఠ పరిమితిని తగ్గించి, పేదలకు భూమిని పంపిణీ చేయడం వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర చట్టాన్ని రూపొందించడం వంటివి ఉన్నాయి. కార్పొరేట్ జోక్యం, ఆధిపత్యాలకు వ్యతిరేకంగా బలవంతపు నిర్వాసితానికి వ్యతిరేకంగా అటవీ హక్కుల అమలు కోసం, ఈ చట్టాల కింద గ్రామ సభల అధికారాలను నిరాకరించే ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా వీవీణ= చట్టానికి సవరణలకు వ్యతిరేకంగా అలాగే, సీఈసీ జ్ఞానేష్ కుమార్ తొలగించి అరెస్టు కోసం చేయాలని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానాలు చేసింది. సుమారు 100 మంది వాలంటీర్లు రోజుల తరబడి చేసిన కృషిని అభినందిస్తూ ప్రతినిధులందరూ గట్టిగా చప్పట్లు కొట్టి వారిని వేదికపైకి ఆహ్వానించడం, ఆ తర్వాత 'అరుణోదయ' బృందం 'కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్' గీతాన్ని ఆలపించడంతో ఈ మహాసభ ముగిసింది ఈ విలేకరుల సమావేశంలో జాతీయ డుడికె నిర్భయ సింగ్, జాతీయ ప్రధాన కార్యదర్శి జేవీ చలపతిరావు జాతీయో ఉపాధ్యక్షులు టి సుధాకర్ ఆశిష్ మిట్టల్, జాతీయ కార్యదర్శి రవీందర్ సింగ్ పాటియాల, జాతీయ కార్యవర్గ సభ్యులు వి వెంకట్రామయ్య, గోని ఐలయ్య, తదితరులు ఈ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు

# తీరిన డ్రైనేజీ సమస్య....




**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** స్థానిక కాలనీలో గత కొంతకాలంగా వేధిస్తున్న డ్రైనేజీ సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. కాలువలు పూడికతో నిండిపోయి మురుగునీరు రహదారులపైకి చేరడం, తీవ్ర దుర్గంధం వ్యాపించడంతో స్థానికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మురుగు నిల్వలతో దోమల బెడద పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఏర్పడటంతో కాలనీవాసులు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన జలమండలి, డ్రైనేజీ విభాగం అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయికి చేరుకుని జేసీబీ, వాటర్ జెట్ యంత్రాల సాయంతో పూడికను తొలగించి లైన్లను పూర్తిగా పునరుద్ధరించారు. సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి ఉపశమనం కలిగించిన అధికారులు, సిబ్బందికి కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో డ్రైనేజీ లైన్లు మూసుకుపోకుండా పైపులైన్లలో ప్లాస్టిక్, ఘన వ్యర్థాలను పారవేయవద్దని స్థానికులకు సూచించిన అధికారులు, పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు.



## పెద్దకాపర్తి హైస్కూల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం

**విద్యార్థులు పరిశుభ్రతను అలవాటుగా మార్చుకోవాలి: సర్పంచ్ కాటం వెంకటేశం**

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలోని హైస్కూల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం ఆధ్వర్యంలో పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాటం వెంకటేశం మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే పరిశుభ్రతను అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, గ్రామంలో కూడా స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లోనే వేయాలని, పరిశుభ్రమైన వాతావరణంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. పాఠశాల హెచ్ఎం శ్రీధర మాట్లాడుతూ విద్యార్థుల్లో స్వచ్ఛతపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి తన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఓర్సు సైదులు, వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రటరీ కృష్ణయ్య, గ్రామ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయవంతమైన దివ్యాంగుల గుర్తింపు శిబిరం

**చండూరు, క్రైమ్ మిర్రర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా,శిశు దివ్యాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ మరియు ఎలిమికోవారి స్వాజన్యంతో నల్గొండ జిల్లాలోని చండూరు మున్సిపాలిటీ లో అక్టోబర్ 01వ తేదీన ప్రత్యేక అవసరములు కలిగిన దివ్యాంగుల గుర్తింపు శిబిరంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చండూరు డివిజన్ కి సంబంధించిన మర్రిగూడ, ఘట్టుప్పల్ మండలంలోని దివ్యాంగులను గుర్తించి వారికి ఎలాంటి పరికరం ఉపయోగపడుతుందో ఆ పరికరాలను కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందించడం కొరకు ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ అవకాశాన్ని కల్పించినందుకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు నల్గొండ జిల్లా కలెక్టర్ మన చండూరులో ఈ క్యాంపు ఏర్పరచినందుకు మున్సిపాలిటీ తరుపున చండూరు మున్సిపల్ చైర్మన్ డా.కోడి శ్రీనివాసులు ధన్యవాదాలు తెలియచేశారు. అదేవిధంగా దివ్యాంగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, పరికరాలు 2 నెల వ్యవధిలో కల్పిస్తారని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు తెలియచేసారు





# ఎన్టీఆర్ ఫౌండేషన్కు దక్కిన గౌరవం

**ఫౌండేషన్ సేవలను గుర్తించిన ప్రభుత్వం**

**రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రం**

**మరింత ఉత్సాహంతో విస్తృతమైన సేవలు అందిస్తాం**

**ఎన్టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** నేలకొండపల్లి మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల పేదలు, విద్యార్థులు, యువత మహిళలకు అనేక రకాలుగా విస్తృతమైన సేవలు అందిస్తున్న ఎన్టీఆర్ ఫౌండేషన్కు ఎట్టకేలకు అరుదైన గౌరవం దక్కింది. గత 45 నెలలుగా మండల కేంద్రంలోని స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్ రావు ఫౌండేషన్(ఎన్టీఆర్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశిష్ట సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు గురువారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026 సందర్భంగా నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ నేలకొండపల్లి, ఖమ్మం జిల్లా వారు చేస్తున్న సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వ అవార్డు ప్రశంసా పత్రాన్ని రాష్ట్ర మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా ఎన్టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావుకు అందించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో కార్పొరేట్ వైద్యం అత్యంత ఖరీదైపోయిందన్నారు. కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందించాలనే సంకల్పంతో సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్ రావు ఫౌండేషన్ పేరుతో స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయంలో నెల నెల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ పేదలకు అన్ని రకాల వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్ సమస్యలతో పాటు కిడ్నీ వ్యాధులు, లివర్, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు, ఇతర సాధారణ జబ్బులకు నిపుణులైన వైద్యులచే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. 100 రూపాయలకే బిపి, షుగర్ మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. వీటితోపాటు ఉచిత క్యాన్సర్ మెగా వైద్య శిబిరాన్ని కూడా అనేకమార్లు నిర్వహించడం ద్వారా ప్రాథమిక దశలోనే క్యాన్సర్ లక్షణాలు కలిగిన రోగులను ముందస్తుగా గుర్తించి వారికి నాణ్యమైన వైద్య సేవలను పొందేందుకు సహకరించామన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు కంప్యూటర్ విద్య, మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ, దివ్యాంగులకు అవసరమైన శిక్షణ తరగతుల నిర్వహణకు సహకరిస్తూ అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాల కోసం పాటుపడుతున్నామన్నారు. ఎన్టీఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందించడం మాపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. రానున్న కాలంలో రెట్టించిన ఉత్సాహంతో విస్తృతమైన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల ఆదరాభిమానాలను పొందడంతో పాటు వారికి మరింత దగ్గర అయ్యేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఎన్టీఆర్ ఫౌండేషన్ సేవలను గుర్తించి అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన అవార్డు అందుకున్న వారిలో ఎన్టీఆర్ ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ చెరువు నరసింహారావు, ఫౌండేషన్ సభ్యులు కొంగర నారాయణరావు, మందడపు, శ్రీనివాసరావు, పాలడుగు పూర్ణచంద్ర ప్రసాద్, షేక్ జమాల్ పాషా, గుత్తా లక్ష్మీనరసయ్య, స్వాతంత్ర సమరయోధుల సంస్థ వారసుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మల్ రెడ్డి రాజశేఖర్, ఫౌండేషన్ శ్రేయోభిలాషులు సాదినేని నరసింహారావు, గరిమెళ్ళ రామారావు, ఏటుకూరి రమ్య, తుళ్లూరి వినీత తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు వైద్యం.. హక్కులపై అవగాహన

**సీనియర్ జడ్జి కవిత, డీఎంహెచ్వో నరేందర్ రాథోడ్ ఆధ్వర్యంలో ఆనంద్ నిలయంలో వైద్య శిబిరం**



**మంచిర్యాల, అక్టోబరు 1 (క్రైమ్ మిర్రర్):** వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సీనియర్ జడ్జి కవిత సూచించారు. జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం ఆనంద్ నిలయం రెడ్క్రాస్ వృద్ధాశ్రమంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్తో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వయోవృద్ధుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు.వైద్య శిబిరంలో సుమారు 25 మంది వృద్ధులకు బీపీ, మధుమేహం తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ అమన్, డాక్టర్ రమ్య, డాక్టర్ తబియా, ఆర్బీఎస్కే వైద్యులు డాక్టర్ రజిత, డాక్టర్ రాము, వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు అందించారు.

**వృద్ధులను గౌరవంగా చూడాలి**

వృద్ధుల హక్కులు, వారికి అందుబాటులో ఉన్న చట్టాలు, న్యాయపరమైన సదుపాయాలపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ బృందం అవగాహన కల్పించింది. వృద్ధులను కుటుంబ సభ్యులుగా భావించి గౌరవంగా చూడాలని, వారి అవసరాలను తీర్చాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వయోవృద్ధులకు ప్రాధాన్యమిస్తూ త్వరగా వైద్య పరీక్షలు, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.జిల్లాలో 30 ఏళ్లు పైబడిన వారికి అసంక్రమణ వ్యాధులైన బీపీ, మధుమేహం తదితర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించడంతో పాటు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు డీఎంహెచ్వో డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులకు కంటి పరీక్షలు, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, రెడ్క్రాస్ సొసైటీ ప్రతినిధి మహేందర్, లైన్స్ క్లబ్ ప్రతినిధి మధుసూదన్రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, రెడ్క్రాస్ సొసైటీ, లైన్స్ ఇంటర్నేషనల్ సభ్యులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో వామపక్ష పార్టీల నిరసన.. సీఈసీ రాజీనామాకు డిమాండ్...!

**జెసి రాజా గౌడ్‌కు వినతిపత్రం సమర్పించిన వామపక్ష నాయకులు 13 కోట్ల ఓటర్ల తొలగింపుపై తీవ్ర ఆందోళన**

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** భారత ఎన్నికల కమిషన్ పనితీరులో చట్ట ఉల్లంఘనలు పెరిగిపోయాయని ఆరోపిస్తూ, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (జుజుజు) జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని జగిత్యాల జిల్లా వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం జగిత్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాజా గౌడ్ గారికి వామపక్ష పార్టీల నాయకులు వినతిపత్రం సమర్పించారు.జిల్లా కేంద్రంలో సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ, ఓటర్ల నమోదు ప్రక్రియలో ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. దేశవ్యాప్తంగా తొలగించిన 13 కోట్ల ఓటర్లను తక్షణమే పునరుద్ధరించాలని, ఎస్ఐఆర్ (ూ×=) ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తిగా ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, పునరుద్ధరణ ప్రక్రియతో పాటు డేటా భద్రతపై బహిరంగంగా వస్తున్న వార్తలు తీవ్రమైన అనుమానాలకు తావిస్తున్నాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు ఎన్నికల ప్రక్రియ యొక్క పారదర్శకత, విశ్వసనీయతపై పౌరుల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నాయని తెలిపారు.

**ప్రధాన డిమాండ్లు:**




ఆరోపించబడిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి; లేనియెడల ఆయనపై మహాభియోగం (ఇంపీచ్‌మెంట్) మోపాలి. ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలి. ఓటర్ల జాబితా నుండి తొలగించిన పేర్లను పారదర్శకంగా సమీక్షించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించి తిరిగి జాబితాలో చేర్చాలి. రాజ్యాంగం, సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ పనితీరును పునర్వ్యవస్థీకరించాలి. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్, కార్యవర్గ సభ్యులు ఎండీ ముఖ్రం, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చింత భూమేశ్వర్, ప్రజా సంఘాల నాయకులు గుడిసెల విజయ్, గుండాలపు ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# హోటల్‌కు దూరంగా.. ఇంటి భోజనంతో డిజెఎఫ్ మహాసభల ప్రచారం

- పొదుపే లక్ష్యంగా జొన్నరొట్టెలు, శనిగ కూరతో ఆందోల్ జర్నలిస్టుల వినూత్న సందేశం
- దళిత జర్నలిస్టుల ఫోరం 11వ రాష్ట్ర మహాసభల విజయవంతం కొరకు ఆరాటం
- ఇంటి భోజనంతో ఆరోగ్యంతో పాటు ఖర్చు ఆదా
- చిన్న పొదుపే.. మహాసభలకు పెద్ద సహకారం
- హోటల్ భోజనానికి స్వస్తి.. ఇంటి భోజనమే మస్తు
- సామాజిక బాధ్యతను చాటుతున్న ఆందోల్ జర్నలిస్టులు
- రూపాయి రూపాయి కూడబెట్టి మహాసభలకు అండగా
- పెట్రోల్, అత్యవసర ఖర్చులకు పొదుపు సొమ్ము
- ఆచరణలో చూపిన జర్నలిస్టుల సామాజిక స్పృహ

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 01:** సామాజిక బాధ్యత, పొదుపు స్ఫూర్తిని చాటుతూ ఆందోల్ జర్నలిస్టులు వినూత్నంగా దళిత జర్నలిస్టుల ఫోరం 11వ రాష్ట్ర మహాసభల ప్రచారం నిర్వహిస్తున్నారు. మహాసభలను విజయవంతం చేయాలనే లక్ష్యంతో వటపల్లి మండలానికి వెళ్లి తిరిగి వస్తున్న సందర్భంగా ఇంటి నుంచి తెచ్చుకున్న జొన్నరొట్టెలు, చనిగాకూరను టిఫిన్ బాక్సుల్లో తీసుకెళ్లి మార్గమధ్యంలో కూర్చొని భోజనం చేశారు. హోటళ్లలో భోజనం చేస్తే ఖర్చు పెరగడంతో పాటు ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందనే ఉద్దేశంతో ఇంటి భోజనాన్నే వెంట తీసుకెళ్తున్నట్లు జర్నలిస్టులు తెలిపారు. రూపాయి రూపాయి



కూడబెడితే వంద రూపాయలు అవుతాయన్న స్ఫూర్తితో, హోటల్ భోజనానికి ఖర్చు చేసే మొత్తాన్ని మహాసభల నిర్వహణకు, ప్రయాణంలో పెట్రోల్ వంటి అత్యవసర అవసరాలకు వినియోగించాలనే ఆలోచనతో ఈ విధానాన్ని పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. పాత్రికేయులు కేవలం వార్తలను రాసేవారే కాకుండా సమాజానికి ఆదర్శంగా నిలిచేలా ఆచరణలోనూ సందేశం ఇవ్వాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత.. సమాజ ప్రయోజనం కోసం చిన్న త్యాగమే పెద్ద సహకారం అంటూ ఆందోల్ జర్నలిస్టుల బృందం సందేశాన్ని అందించింది. దళిత జర్నలిస్టుల ఫోరం 11వ తెలంగాణ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు ఆందోల్ ప్రాంత జర్నలిస్టులు చేస్తున్న ప్రచారం, వారి సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.

# అభివృద్ధికి నిరంతరం కృషి చేయడమే లక్ష్యంగా ముందుకు : బోయపల్లి రాఘవేందర్ రెడ్డి



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ 57వ డివిజన్ నాదర్గుల్ లోని సమస్యలను వివరించిన ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి. ప్రజలు ఎదుర్కొంటున్న అత్యవసర మౌలిక వసతుల సమస్యలు, ప్రధాన రహదారుల విస్తరణ అవసరం తదితర అభివృద్ధి అంశాలకు సంబంధించి అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి తగిన నిధులు మంజూరు అయ్యేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సహకరించాలని వేం నరేందర్ రెడ్డి ని కోరడం జరిగిందని, ప్రజల అవసరాలను సంబంధిత ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నాదర్‌గుల్ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి తెలిపారు.



# హిందూ ధర్మంపై వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ నాయకుల ఆందోళన

**పోలీస్ స్టేషన్‌కు తరలించిన జిల్లా, మండల నాయకులు**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఊరుకొండ):** బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు హిందూ ధర్మం, దేవుళ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలను నిరసిస్తూ అక్టోబర్ 1న ఊరుకొండ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా, మండల నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హిందూ ధర్మం, దేవుళ్లను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ నాయకులు పేర్కొంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# 9వ వార్డులో జాతీయ పోషణ మాసం లో భాగంగా విహెచ్ ఎండి పోషణ మరియు ఆరోగ్య దినము నిర్వహణ

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** ఐసిడిఎస్ ప్రాజెక్టు జగిత్యాల అర్బన్ టు సెక్టార్లు లో అన్ని 9వ వార్డు కౌన్సిలర్ వారణాసి మల్లమ్మ తిరుమలయ్య అధ్యక్షతన సూపర్వైజర్ ఆధ్వర్యంలో జాతీయ పోషణ మాసంలో భాగంగా విహెచ్ఎస్ఎండి నిర్వహించడం జరిగినది దీని యొక్క ముఖ్య ఉద్దేశం ఈరోజు తల్లుల సమక్షంలో ఒక పండుగ వాతావరణంలో పోషకాహార ప్రాధాన్యత సమతుల్య ఆహారము మరియు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై మరియు స్థానికంగా లభించే పప్పు దినుసులు ఆకుకూరలు ,కూరగాయలు, పండ్లు, పాలు , మిల్లెట్ గింజ ధాన్యాలు,వివిధ ఆహార పదార్థాలతో తయారుచేసిన పోషకాహార వంటలను ప్రదర్శించి వాటిలో గల పోషక విలువల మరియు వాటి యొక్క ప్రాధాన్యత గురించి తల్లులకు వివరించడం జరిగినది దీనిలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలలో ఈరోజు పిల్లల యొక్క బరువులు ,ఎత్తులు ,గర్భిణీ స్త్రీల యొక్క బరువులు, ఎత్తులు , పొడవులూ తీసి తల్లులకు అవగాహన కలిగించి బాలామృతం మరియు ఎగ్స్ వార్డ్ కౌన్సిలర్ గారి చేతులమీదుగా టి హెచ్ ఆర్ పంపిణీ చేయడం జరిగినది వార్డ్ కౌన్సిలర్ గారు మాట్లాడుతూ రోజు ఆహారంలో ఇక్కడ ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా చేసి చూపించినవి రోజు ఆహారంలో తీసుకొనవలసని పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించవలెనని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకున్న వలనని తల్లులకు అవగాహన కలిగించినది వార్డు కౌన్సిలర్ చేతుల మీదుగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు, అన్నప్రాసన ,కార్యక్రమము నిర్వహించి పోషణ ప్రతిజ్ఞ చేయడము జరిగినది పోషకాహారం ఆరోగ్యకరమైన కుటుంబం బలమైన సమాజం గూర్చి తల్లులకు అవగాహన కలిగించినది ఈ కార్య క్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ వారణాసి మల్లవ్వ తిరుమలయ్య, సూపర్వైజర్ మమత, ఏ న ఎం జ్యోతి ఆశ శిలాజ అంగన్వాడీ టీచర్ పుష్ప ఆయా తల్లులు, గర్భిణీ,బాలింతలు,పిల్లలు పాల్గొన్నారు

